క్లుప్తంగా

క్రీడల్లో సత్తాచాటాలి



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో యువత పాల్గొని సత్తా చాటాలని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి సూచించారు. బసినేపల్లిలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ రంగనాయకులు జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. పోటీల్లో గెలిచిన సీనియర్ వారియర్స్, రన్నర్స్‌గా నిలిచి కొత్తకోట్టాల జట్లకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శివయ్య, రాజేష్, నరేష్, శివ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే కేసులు



రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న ఎస్‌ఐ శరత్ చంద్ర

పెద్దపప్పూరు: 'గ్రామాల్లో ఆధిపత్యం కోసం సమస్యలు సృష్టిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. సమస్యలకు కారణమైన వారిపై కేసులు నమోదుచేస్తాం' అని ఎస్‌ఐ శరత్‌చంద్ర రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి చిన్నపాటి సమస్య వచ్చినా సొంతనిర్ణయం తీసుకోకుండా ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణమే పరిష్కరిస్తారని చెప్పారు.

ఘనంగా వసంతోత్సవం



సంబరాలు చేసుకుంటున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీశరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య, యువజన సంఘాల నాయకులు చిన్నా,పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగితేలారు. అమ్మవారి విగ్రహాన్ని ధర్మవరం గేట్, మండీబజార్, మెయిన్‌రోడ్డు మీదుగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాజగదీష్, సంఘం సభ్యులు ఇల్లూరు కేదార్, లాయర్ మధు, సోమనాథ్, జీవన్‌గుప్త, ఇల్లూరు గోపి, విశ్వనాథ్, ప్రదీప్, శ్రీరామ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నేడు జ్యోతుల మహోత్సవం

పెద్దపప్పూరు: దసరా పండుగ సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున నిర్వహించబోయే చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పక్కాగా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు.

గౌరవంగా ఆఖరు మజిలీ..



మురళీమోహన్ భౌతికకాయాన్ని తరలిస్తున్న మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని పెద్దపప్పూరులో మంగళవారం నేతకార్మికుడు మాదన మురళీమోహన్ (50) అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే ఆత్మీయులు, బంధువులు ఆయన అంత్యక్రియలకు మాత్రం ముందుకు రాలేదు. దీంతో మృతుని ఇద్దరు కుమారులు పవన్‌కళ్యాణ్, ధనుంజయ మండల కేంద్రంలోని మేఐహెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులకు తెలిపారు. వెంటనే ఆ సంస్థ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ధ్రువనారాయణ, బండారు బాలకృష్ణ, చింతా నరసింహ తదితరులు అంత్యక్రియలు నిర్వహించారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా అనాథలు, బంధువులు లేనివారు చనిపోతే 8686808333, 9912099782 నంబర్లకు సమాచారం అందిస్తే అంత్యక్రియలు పూర్తి చేస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వశికేరప్ప బ్రహ్మోత్సవాలు

రాప్తాడు: మరూరులో వశికేరప్పస్వామి విజయదశమి బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. వశికేరప్పస్వామి ట్రస్ట్ చైర్మన్ బుడగ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కుల గురువులు, గుడికట్టు పిన్న పెద్దలు, పూజారులు, కాపులు కలసి భక్తి శ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం వద్ద వెండి గుర్రంపై ప్రారంభమైన స్వామి ఊరేగింపు అర్ధరాత్రి వరకు కొనసాగింది.

వైభవంగా దసరా ఉత్సవాలు

దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ ఆలయాల్లో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు.

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పలు ప్రాంతాల్లో ఘనంగా గ్రామోత్సవాలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు



తాడిపత్రి: జమ్మిచెట్టును దర్శించుకుంటున్న భక్తులు



గుత్తి: వాసవీ ఆలయంలో రుద్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని పెద్దపోలమడ గ్రామంలో మంగళవారం వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహించారు. గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు పెద్ద ఎత్తున కోలాటం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున గ్రామస్తులు హాజరు కావడంతో ఆలయ ముందు సందడిగా మారింది.

యాడికి: విజయదశమి వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే యువకులు, పెద్దలు, మహిళలు నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మామిడాకులు, పిండి వంటలతో అమ్మవారిని ఆహ్వానించి వేడుకలు నిర్వహించారు. జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆర్యవైశ్యులు వాసవీమాత ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. రాయలచెరువులో సుంకులమ్మ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

కనుల పండువగా రథోత్సవం

పెద్దవడుగూరు: మండల ప్రజలు దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మేడిమాకులపల్లి, చిత్రచేడు, పెద్దవడుగూరు, క్రిష్టిపాడు గ్రామాల్లోని చౌడేశ్వరీదేవీ ఆలయాలు, అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్దవడుగూరులో చెన్నకేశవస్వామి ఆలయం, పేట శివాలయం భక్తులతో పోటెత్తాయి. సుంకులమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో విజయదశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మెయిన్‌బజార్‌లోని ఆర్‌వీస్వామి కళ్యాణ మండపం నుంచి 102 మంది కన్యలు పాల కలశాలను వాసవీఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. రాత్రి 9 గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరీ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



గుంతకల్లుటౌన్: శ్రీమారెమ్మదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



పామిడి అలంకరణలో ప్రసన్న పార్వతీదేవి



తాడిపత్రి: బంగారు చీర అలంకారంలో వాసవీమాత



పెద్దవడుగూరు: అలంకరణలో కుంటిమ్మతల్లి

గుంతకల్లుటౌన్/పామిడి/గుత్తి: విజయదశమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, దుర్గాభవానీ, కాళీకమాత, సుంకులమ్మ, మస్తాన్‌పేట మారెమ్మ, త్రిపుర సుందరీ దేవి, వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం భక్తాదులు సత్యనారాయణపేట, ఎల్లమ్మతగ్గు, అంబేద్కర్‌నగర్,భాగ్యనగర్ ఏరియాల్లో గల శమీవృక్షాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారిని విశేషంగా అలంకరించి పురవీధుల గుండా నిర్వహించిన శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. కేరళకు చెందిన సాంప్రదాయ డప్పు కళాకారుల వాయిద్యాలకు భక్తాదులు నృత్యాలను ప్రదర్శించారు. మస్తాన్‌పేటలోని మారెమ్మ దేవి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పూజలు, హోమాలు నిర్వహించారు. వర్షాలు సంవృద్ధిగా కురిపించి అన్నదాతలు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు రామ్మోహన్, ప్రతాప్, అర్చకులు ఎమ్మెల్యే వైవీఆర్‌ను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే పామిడిలో దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా గుత్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రుద్ర హోమం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వేద పండితులు వాసు దేవ శర్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



యాడికి: భవానీదేవిగా వాసవీమాత



భక్తులతో కిటకిటలాడుతున్న పెద్దవడుగూరులోని శివాలయం



యాడికి పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు



తాడిపత్రి: శమీవృక్ష దర్శనానికి హంసవాహనంపై వచ్చిన చింతల వెంకటరమణస్వామి, బుగ్గరామలింగేశ్వరుడు

మిల్లుకాలనీలో జ్యోతుల ఉత్సవం



పూజలు నిర్వహిస్తున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మిల్లుకాలనీలో ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతుల ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారిని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌ఛార్జ్ శేఖర్, నాయకులు కుండా రాఘవేంద్ర, విజయ్,అశ్విని, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా నిర్యాణ దినోత్సవం

గుత్తి: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం షిరిడీసాయి నిర్యాణ దినోత్సవాన్ని నిర్వహించారు. షిరిడీ సాయి బాబా సమాధి అయి 105 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నమూనా సాయిబాబా సమాధిని రూపొందించారు. 105 కొవ్వొత్తులు వెలిగించారు. నమూనా సమాధి వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జేకే రాము, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



బుక్కరాయసముద్రంలో మహిషాసుర మర్దిని అలంకరణలో ముసలమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఆలయాల్లో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు ముగిశాయి. మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో కన్యకా పరమేశ్వరిదేవి వెండి చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని ముసలమ్మ ఆలయంలో ముసలమ్మ తల్లి మహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు.

26న సాధికారిక బస్సు యాత్ర

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 26న బుక్కరాయసముద్రంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో సాధికారిక బస్సు యాత్ర జరుగనుంది. ఈ మేరకు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

పల్లకీలో వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



వేంకటేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న ప్రజలు

యల్లనూరు: మండల కేంద్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామిని పల్లకీలో ఊరేగించారు. అమ్మవారిశాలలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వెండి కిరీటం వితరణ



వెండి కిరీటంతో రాములమ్మ

యాడికి: మండల కేంద్రంలోని చందన రహదారిలో ఉన్న రాములమ్మ గుడికి సోమవారం గ్రామానికి చెందిన ఓ భక్తుడు రూ.80 వేలు విలువ చేసే వెండి కిరీటం వితరణ చేసినట్లు ఆలయ పూజారి లింగం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయ్యప్ప విగ్రహ పునః ప్రతిష్ఠ బ్రోచర్ల విడుదల



బ్రోచర్లను విడుదల చేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: చెరువుకట్టపై వెలసిన అయ్యప్ప స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ బ్రోచర్లను ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి చేతులు మీదుగా విడుదల చేశారు. డిసెంబర్ 2,3,4 తేదీల్లో అయ్యప్ప విగ్రహ పునఃప్రతిష్ఠ ఉంటుందని, శబరిమల ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ రాజీవ్ తంత్రి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సాయి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు బుట్నా మణికంఠ గౌతం, ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి బోనా నాగలింగారెడ్డి, ఉపాధ్యక్షులు గజేంద్రమోహన్, కోశాధికారి నాగానందం, కల్లూరు రాము, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

శింగనమల: మండలంలోని ఆనందరావుపేటకు చెందిన చిన్న నరసింహుడికి కంచిరెడ్డి ఫౌండేషన్ కంచిరెడ్డి కరుణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.25వేలు అందించారు. చిన్న నరసింహుడు ఇల్లు గతంలో వర్షాలకు కూలిపోయింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు బాలిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సీతారాంరెడ్డి, రమేష్, అమరనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వైద్యాధికారి గౌతమి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 15 గ్రామ సచివాలయ పరిధిలో గత నెల 30 నుంచి అక్టోబర్ 20 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 4,356 మంది ఓపీ సేవలు వినియోగించుకున్నారన్నారు. 30 మంది చిన్నపిల్లలు, ఎముకులు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి స్పెషలిస్టు వైద్యులు సేవలు పొందారని, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న 110 మందిని ఆరోగ్యశ్రీ పథకం కింద జిల్లా నెట్‌వర్కు ఆస్పత్రులకు రెఫర్ చేశారన్నారు. జగనన్న కంటి వెలుగు కింద 993 మందికి కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు.

దుర్గమ్మ విగ్రహ నిమజ్జనం

పుట్లూరు: మండలంలోని బాలాపురంలో దుర్గమ్మ విగ్రహ నిమజ్జనం మంగళవారం నిర్వహించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేశారు.

నేడు చౌక డిపో డీలర్ల సమావేశం

శింగనమల: మండలంలోని చౌకధాన్యపు డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో బుధవారం సమావేశం ఉంటుందని తహసీల్దార్ ఈశ్వరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు.

29న సాహితీ సదస్సు

అనంతపురం కల్చరల్: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'కామ్రేడ్ కలేకూరి జీవితం-సాహిత్యం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు జిరసం అధ్యక్ష కార్యదర్శులు జెన్నే ఆనంద్‌కుమార్, కొత్తపల్లి సురేష్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రముఖ కవి కత్తి కల్యాణ్ ప్రధాన వక్తగా పాల్గొంటారన్నారు.

హంస వాహనంపై చింతలరాయుడు



తాడిపత్రి అర్బన్: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చింతల వెంకటరమణస్వామి సోమవారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం స్వామివారిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. హంస వాహనంపై సరస్వతీదేవి అలంకారంలో తిరువీధుల్లో స్వామివారిని విహరించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దసరా పండుగ సందర్భంగా ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. 108 శివలింగాలకు మొక్కుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్

వివిధ రూపాల్లో అమ్మవారు



పామిడిలో విజయలక్ష్మిదేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరీమాత



పామిడిలో విరోబ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పామిడి: పామిడితో పాటు మండలంలోని అమ్మవారి ఆలయాల్లో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అంభాభవానీమాత, కన్యకా పరమేశ్వరిమాత ఉత్సవ విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు ఎదుట భక్తులు కలశాలతో భక్తి గీతాలు ఆలపిస్తూ అమ్మవార్ల నగర ప్రదర్శన గావించారు. దారిపొడవునా భక్తులు అమ్మవారిని దర్శించుకొని తరించారు. ప్రప్రథమంగా అమ్మవారి ఈ రెండు రథాలు యాదృచ్ఛికంగా ఒకేచోట కలవడంతో భక్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

నేటి నుంచి ఎగ్జిబిషన్

అనంతపురం రూరల్: చేనేత, ఖాదీ ఉత్పత్తులు, హస్తకళాకారులను ప్రోత్సహించే లక్ష్యంగా భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ, హస్తకళా సేవా కేంద్రం (తిరుపతి) ఆధ్వర్యంలో శిల్పారామంలో బుధవారం నుంచి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాల కళాకారులు తమ ఖాదీ ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. ఏడు రోజుల పాటు రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 7.30 వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబా మహాసమాధి వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు బాబా మందిరాలలో శ్రీషిరిడి సాయిబాబా మహాసమాధి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మహాసమాధి పొంది 105 ఏళ్లయిన సందర్భంగా 105 దీపాలు వెలిగించారు. స్థానిక వేమనా టెలీఫోన్ భవన్ ఎదురుగా ఉన్న శ్రీషిరిడిసాయిబాబా మందిరంలో విశేష అలంకార సేవలు, ప్రసాద వితరణ జరిగింది. భక్తులు బారులు తీరి బాబా ప్రతిమను తాకి పూజలాచరించారు. 3వ రోడ్డు, పాతూరు చెరువుకట్ట, రామచాంద్రానగర్, వేణుగోపాలనగర్, తపోవనం శ్రీశివశక్తిబాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి.